ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- విద్యాశాఖ అదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం
- హాజరైన అధికారులు, ప్రధానోపాధ్యాయులు

పరిగి : విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈవో హరిశ్చంద్ర

పరిగి, జూలై 20 : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని పరిగి ఎంఈవో హరిశ్చంద్ర అన్నారు. విద్యాశాఖ అదేశాల మేరకు శనివారం మండలంలోని సయ్యద్ మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలు రోజూ బడికి వచ్చేలా చూడాలని, ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్‌ను ఇంటి వద్ద క్రమం తప్పకుండా చేస్తున్నారా లేదా పర్యవేక్షిస్తూ చదువులో శ్రద్ధ చూపాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల గురించి ఉపాధ్యాయులు తెలియజేయాలని ఎంఈవో తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.

కొడంగల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రాంరెడ్డి

పూర్తి సౌకర్యాలు కల్పించాలి

కొడంగల్ : పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలికల ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో విద్యార్థుల ప్రతిభ, అవసరాలు, విద్యాపరంగా అంశాలను చర్చించారు. అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, అవరరమైతే నోటీసులు జారీ చేయాలని తీర్మానించారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రహరీ లేని కారణంగా విషపురుగులు వచ్చే ఆస్కారం ఉంటుంది కాబట్టి మున్సిపల్ సిబ్బందితో కంపచెట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని తదితర తీర్మానాలు చేపట్టినట్లు ఎంఈవో రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ హక్, మెరాజ్‌బేగం, షహానాబాను, వేణుగోపాల్, అశ్విని పాల్గొన్నారు.

బొంరాస్‌పేట : ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎం హరిలాల్

పాఠశాలల బలోపేతానికి చర్యలు

బొంరాస్‌పేట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో పాఠశాలల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, విద్యార్థులకు పంపిణీ చేసిన ఉచిత పాఠ్య పుస్తకాలు, పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై చర్చించారు. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థుల సామర్థ్యాలను ప్రదర్శించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడడంతో పాటు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలను అందించాలని హెచ్ఎంలు కోరారు.

స్నేహపూర్వకంగా ఉండాలి

మర్పల్లి : తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలని ఎస్వో రజని అన్నారు. మండలంలోని పంచలింగాల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంట్లో అనువైన ప్రదేశాన్ని కేటాయించాలని, పఠనాసక్తులను కల్పించడానికి కృషి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కేశవులు, సీఆర్‌పీ మల్లేశం, పాఠశాల చైర్మన్ శ్యామలమ్మ పాల్గొన్నారు.

మర్పల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వో రజని

ఆలయాలు ముస్తాబు

మర్పల్లి, జూలై 20 : మర్పల్లి మండల కేంద్రంతో పాటు సిరిపురం, కుడుగుంట, కోట్‌మర్పల్లి సాయిబాబా ఆలయాలను గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా ముస్తాబు చేశారు. మర్పల్లి సాయిబాబా ఆలయంలో ఆదివారం ఉదయం ధ్వజారోహణం, కాకడ హారతి, అభిషేకం, స్వామివారికి హోమం, మధ్యాహ్న హారతి.. అనంతరం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ధూప హారతి, భజనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని మర్పల్లి ఆలయ నిర్వాహకుడు మల్లేశం తెలిపారు. మర్పల్లి గ్రామం నుంచి సాయిబాబా ఆలయం వరకు పల్లకీ సేవ ఉంటుందని పేర్కొన్నారు.

కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ ప్రాంతంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసులు శనివారం విధుల్లో చేరారు. ప్రస్తుతం విధులు నిర్వహించిన ప్రిన్సిపాల్ బలరాంనాయక్‌కు గ్రేడ్-1 ప్రిన్సిపాల్‌గా ప్రమోషన్‌తో పాటు నర్సాపూర్‌కు బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో నల్లగొండ జిల్లా దామరచర్ల నుంచి శ్రీనివాసులు బదిలీపై వచ్చారు.
- కొడంగల్, జూలై 20

జాతరకు దర్గా ముస్తాబు

నేటి నుంచి 43వ ఉర్స్ ఏ షరీఫ్ సయ్యద్ హుస్సేన్ పటేల్ జాతర

మర్పల్లి, జూలై 20 : మండల కేంద్రంలోని సయ్యద్ హుస్సేన్ పటేల్ 43వ ఉర్స్ జాతర ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజులు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సదర్ ఎండీ సలీమొద్దీన్, నాయక్ సదర్ ఖాజా షరీఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 8 గంటలకు మహబూబ్ సుభాని దర్గా నుంచి గంధాన్ని గ్రామంలో ఊరేగిస్తూ సయ్యద్ పటేల్ దర్గాకు చేరుకుంటుంది. సోమవారం అన్నదాన కార్యక్రమం, రాత్రి 9 గంటలకు గంధం ఖురేషీ మొహల్లా నుంచి సయ్యద్ పటేల్ దర్గాకు చేరుకుంటుందన్నారు. మంగళవారం దర్గా వద్ద దీపాలు వెలిగిస్తారని.. యువకులతో గంధం మహబూబ్ సుభానీ దర్గా నుంచి బయలుదేరి హజ్రత్ సయ్యద్ హుస్సేన్ హసం ఖాద్రీ దర్గాకు చేరుతుందని తెలిపారు. ఉదయం నమాజ్ తర్వాత ఖత్మే ఖురాన్ ఖానీ, పాతేహ ఖానీ, ప్రసాదం పంపకాలు జరుగుతాయన్నారు. 22, 23 తేదీల్లో ఖవ్వాలి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వన మహోత్సవ లక్ష్యం లక్షా65వేలు

- ఈ నెల 31లోగా పూర్తిచేయాలి
- పెద్దేముల్ మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎంపీడీవో జర్నప్ప

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పెద్దేముల్ మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ

పెద్దేముల్, జూలై 20 : వన మహోత్సవంలో భాగంగా ఈ నెలాఖరు వరకు మండలానికి ఇచ్చిన లక్ష్యం లక్షా65వేల మొక్కలను నాటేందుకు చర్యలు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దేముల్ మండల స్పెషల్ ఆఫీసర్, తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో వన మహోత్సవంపై సమీక్షా సమావేశం నిర్వహించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పెద్దేముల్ సత్యనారాయణ, ఎంపీడీవో జర్నప్ప మాట్లాడుతూ.. వన మహోత్సవంలో భాగంగా మొక్కలను గ్రామాల్లోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా, పాఠశాలల్లో, కంపోస్టు షెడ్లు, శ్మశానవాటికలు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో నాటాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనుల్లో భాగంగా మురుగుకాల్వలు, ప్రధాన రోడ్లు, కాలనీలు, ఇండ్ల పరిసరాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఇతర ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను ఎంపీడబ్ల్యూ వర్కర్లతో పరిశుభ్రం చేయించి సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు, ఈగల నివారణకు ఫాగింగ్ మిషన్లతో నివారణ మందులను పిచికారీ చేయించాలని, తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని, నీటి ట్యాంకులను పరిశుభ్రంగా కడిగించాలన్నారు. ఈ నెల చివరి వరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యం, మొక్కలు నాటే పనులను పది రోజులపాటు నిరంతరంగా చేయించాలన్నారు. అలాగే ప్రభుత్వం మంజూరు చేసిన పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను త్వరితగతిన వారి అకౌంట్లలో జమ చేయాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రమేశ్ కుమార్, ఏపీవో నర్సింహులు, పంచాయతీల కార్యదర్శులున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేశవరావును హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న పరిగి ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- పరిగి, జూలై 20

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

బొంరాస్‌పేట, జూలై 20 : బొంరాస్‌పేట మండలంలో 25 మంది పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 8 మంది ఇతర మండలాలకు వెళ్లగా 17 మంది మండలంలోనే ఇతర గ్రామాలకు బదిలీ అయ్యారు. కృష్ణయ్య దుప్చెర్ల నుంచి తాండూరు మండలం మిట్టబాస్‌పల్లికి, స్వాతి ఎనికేపల్లి నుంచి దౌల్తాబాద్ మండలం ఇండాపూర్‌కు, జగదీశ్‌గౌడ్ సాగారం తండా నుంచి కొడంగల్ మండలం కస్తూర్‌పల్లికి, నరహరి బుర్రితండా నుంచి యాలాలకు, భీమాశంకర్ మేడిచెట్టుతండా నుంచి దోమ మండలం బ్రాహ్మణపల్లికి, జైపాల్ దుద్యాల నుంచి దౌల్తాబాద్ నుంచి బిచ్చాల్‌కు, ఫకీరయ్యగౌడ్ బాపల్లితండా నుంచి పెద్దేమల్ మండలం దుగ్గాపూర్‌కు, ఆశప్ప గట్టెగానితండా నుంచి కొడంగల్ మండలం అన్నారంకు బదిలీ అయ్యారు.

మిగతావారిలో రాకేశ్ లింగన్‌పల్లి నుంచి గట్టెగానితండాకు, మహేశ్వరి ఏర్పుమళ్ల నుంచి కొత్తూరుకు, హరీశ్వర్‌రెడ్డి లగచెర్ల నుంచి సాగారంతండాకు, శివలింగప్ప నాస్కంపల్లి నుంచి బొట్లవానితండాకు, మోహన్ కొత్తూరు నుంచి లగచెర్లకు, కృష్ణచైతన్యరెడ్డి కూబ్యానాయక్ తండా నుంచి మూడుమామిళ్లతండాకు, నరేందర్ సంట్రకుంటతండా నుంచి ఎన్నెమీదితండాకు, రెడ్డి మల్లేశం సత్తుర్‌కుంటతండా నుంచి లింగన్‌పల్లికి, బసంత్‌రెడ్డి సూర్యానాయక్‌తండా నుంచి నాగిరెడ్డిపల్లికి, సూర్యప్రకాశ్ బొట్లవానితండా నుంచి ఈర్లపల్లికి, రవినాయక్ మూడు మామిళ్లతండా నుంచి బాపన్‌చెరువుతండాకు, కృష్ణగౌడ్ బాపన్‌చెరువుతండా నుంచి మేడిచెట్టుతండాకు, కార్తీక్ ఎన్నెమీదితండా నుంచి బాపల్లితండాకు, రవీందర్ నాగిరెడ్డిపల్లి నుంచి బుర్రితండాకు, యాదగిరి చౌదర్‌పల్లి నుంచి సత్తుర్‌కుంటతండాకు, వీరన్న ఎన్నెమీదితండా నుంచి దుప్చెర్లకు, ప్రభాకర్ ఈర్లపల్లి నుంచి ఎనికేపల్లికి బదిలీ అయ్యారు.


తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు - ధారూరు, జూలై 20

ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు

తాండూరు మండలం, జినుగుర్తి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహించి, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు - తాండూరు రూరల్, జూలై 20

చెట్ల పెంపకంతోనే సమతుల్య వాతావరణం

మహిళలకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో మహేశ్‌బాబు

దోమ, జూలై 20 : చెట్ల పెంపకంతోనే సమతుల్య వాతావరణంతోపాటు ఆరోగ్యకర పరిస్థితులు నెలకొంటాయని ఎంపీడీవో మహేశ్‌బాబు, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో హోంసీడ్ ప్లాంటేషన్‌లో భాగంగా ఎంపీవో సోమలింగంతో కలిసి ఎంపీడీవో మహిళా సంఘాల సభ్యులకు మొక్కలను పంపిణీ చేశారు. ఇంటి ఎదుట మహిళలు రెండు మొక్కలు పెంచి వాతావరణ సమతుల్యతను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహులు, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ యాదయ్యగౌడ్, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు, గ్రామ సభ్యులు ఆశిరెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి, జూలై 20 : రైతు బీమా కోసం కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు ఈ నెల 30లోగా వ్యవసాయ విస్తరణాధికారికి స్వయంగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డి కోరారు. 2024 జూలై 5 వరకు వచ్చిన పట్టా పాసుపుస్తకాల రైతులే అర్హులన్నారు. అంతకుముందు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోనివారు అర్హులని చెప్పారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో దరఖాస్తు ఫారంలో రైతు సంతకం చేసి వ్యవసాయ విస్తరణాధికారికి అందజేయాలని ఆయన కోరారు.

ఈ నెల 30 వరకు అవకాశం

దోమ : రైతు బీమాకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు బీమా కోసం జూన్ 28 నాటికి రిజిస్ట్రేషన్ అయిన రైతుల డేటా ధరణి పోర్టల్ నుంచి వ్యవసాయ శాఖకు చేరిందన్నారు. మీ వయస్సు 18-59 ఏండ్ల మధ్య ఉన్నట్లయితే ఆగస్టు 4లోపు మీ గ్రామ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని రైతు వేదికలో కలిసి రైతు బీమా దరఖాస్తు ఫారంతోపాటు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, నామినీ బ్యాంకు పాసు బుక్‌లను పట్టాదారు స్వయంగా ఏఈవోలను కలిసి రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతుబీమాలో తప్పుల సవరణకు ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న రైతులు మరల దరఖాస్తు చేసుకోవలసిన అవసరం లేదని పేర్కొన్నారు.

దుకాణాల టెండర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి

కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న సీపీఎం నాయకుడు వెంకటయ్య

పరిగి, జూలై 20 : పరిగి మున్సిపాలిటీకి చెందిన 27 దుకాణాలకు వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యకు సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. 27 దుకాణాలకు ఏప్రిల్ 30వ తేదీతో గడువు ముగిసిందని, టెండర్ కాలం గడిచినా అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదన్నారు. దీంతో ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం వాటిల్లుతున్నదన్నారు. టెండర్ ప్రక్రియ విధానంలో దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేశ్, వెంకటయ్య ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే.. వెళ్లేదెలా..?

దోమ, జూలై 20 : దోమ మండలం అయినాపూర్ గ్రామంలోని 8వ వాడ్డు ఊరడమ్మ కాలనీలో మురుగు కాలువ, సీసీ రోడ్డు లేకపోవడంతో చినుకు రోడ్డంతా చిత్తడిగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటికి వెళ్లడానికి జంకుతున్నారు. తమ కాలనీలో సీసీ రోడ్డు వేయాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా తమ గోడు ఆలకించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వికారాబాద్‌లో శనివారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి విజయరామారావును సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి - వికారాబాద్, జూలై 20

బీపీఈడీ, డీపీఈడీ పరీక్షా తేదీలు మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న డీఎస్సీ పరీక్ష జరుగనున్న నేపథ్యంలో ఆ రోజు నిర్వహించాల్సిన బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ పరీక్షలను తిరిగి వచ్చే నెల 19న నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహశర్మ

కొత్త చట్టాలు అభినందనీయం

హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహశర్మ

బంజారాహిల్స్, జూలై 20 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ చట్టాలు బాగున్నాయని.. కొత్త చట్టాలు తీసుకురావడం అభినందనీయమని రాష్ట్ర హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ బి.నర్సింహశర్మ అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం కాలేజీలో అన్‌లాకింగ్ 'కొత్త దిశలు -భారతదేశం యొక్క కొత్త క్రిమినల్ చట్టాలు' అనే అంశంపై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మహిళలకు, పిల్లలకు ప్రస్తుతం కొత్త చట్టాలలో ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. జీరో ఎఫ్ఐఆర్‌తో పాటు ఈ-ఎఫ్ఐఆర్‌ను కూడా నమోదుచేసుకునే వెసులుబాటు ఈ చట్టాల్లో కల్పించినట్లు తెలిపారు. ఏండ్ల తరబడి కేసులు సాగకుండా ప్రతి కేసుకు ఒక నిర్దిష్ట సమయాన్ని కేటాయిస్తూ రూపొందించబడ్డాయని తెలిపారు. టెర్రరిస్ట్ కార్యకలాపాలు, ఉద్దేశపూర్వకంగా నేరాలు చేసేవారికి ఇందులో కఠిన శిక్షలుంటాయని పేర్కొన్నారు. ముఖ్యంగా హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రస్తుతం సెక్షన్లలో బాధితులను ఆస్పత్రిలో చేర్చి పోలీసులకు సమాచారం ఇచ్చిన వారికి శిక్ష తగ్గుతుందని తెలిపారు. నిర్లక్ష్యంగా వెళ్లిపోయే వారికి కఠిన శిక్షలుంటాయన్నారు.

టెక్నాలజీ సంబంధిత వీడియో, ఆడియో టెక్నికల్ ఎవిడెన్స్‌లకు గతంలో పోలిస్తే ప్రస్తుత చట్టాలలో మంచి ప్రాధాన్యతనిచ్చారని సొలిసిటర్ జనరల్ తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఓయూ లా కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ జీబీ రెడ్డి మాట్లాడుతూ.. కొత్త చట్టాలు పారదర్శకంగా.. సరళతరంగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమాచారి, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వరి పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The Notice is hereby given to General Public that our client is intending to purchase All that Piece and parcel of land admeasuring a portion of the Property, specifically admeasuring: 2 Acres 19 Guntas out of Ac 5.13 gts in Survey Number 905/EE, measuring 0 Acres 37 Guntas, •Survey Number 905/1/E, measuring 0 Acres 31 Guntas, Survey Number 905/1/U, measuring 0 Acres 30 Guntas, Survey Number 905/1/UU, measuring 2 Acres 35 Guntas. situated in Mekaguda G.P Nandigama Revenue Village and Mandal,Ranga Reddy District and Sub-Registration Dist Shadnagar together with all easementary rights appurtenant thereto and bounded by: -North: Land of Vendor (Natco Pharma Limited) sy No. 905,South: Land of Vendor (Natco Pharma Limited) sy No. 905, East: Land of Vendor (Natco Pharma Limited) sy No. 318,West: 40 Feet wide Road. Any person more particularly Bank and Financial institution or any person having claiming any right, interest, claim, demand or benefit whatsoever in respect of the Schedule Property by way of sale, exchange, mortgage, gift, trust, development rights, inheritance, bequest, possession, lease, license, tenancy, lispendens, lien, charge, maintenance, easement or under any Agreement or Power of Attorney whatsoever or otherwise howsoever, is hereby required to notify the same in writing with documentary proof thereof to the undersigned at the address as mentioned below, within Seven (7) days from the date hereof, failing which it shall be construed that either there is no claim, demand, right or interests whatsoever in or over the Schedule Property adverse to the aforesaid owner or the same has been waived for all intents and purposes and sale shall be completed.

Sd/- **PRAVEEN KUMAR JAIN**
Advocate
H. No: 14-1-18, Near Police Station
Mangalhat, Hyderabad-500006.
Cell: 9851609064

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

OLD AGE HOME

★ ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325766-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ ఇబ్రహీంపట్నం/మహేశ్వరం } 80966 77668 : 80966 77962